28-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - భోళానాథుడైన తండ్రి ఒక్కరే మీ జోలెను జ్ఞాన రత్నాలతో నింపుతారు, వారే కల్పవృక్షము యొక్క బీజరూపుడు, వారిని ఇంకెవరితోనూ పోల్చలేరు"

ప్రశ్న:- చాలా మంది పిల్లలు తండ్రిని కూడా మోసం చేయడానికి ప్రయత్నిస్తారు, ఎలా మరియు ఎందుకు?

జవాబు:- తండ్రిని యథార్థంగా గుర్తించని కారణముగా తప్పులు చేసి కూడా దాచిపెడతారు, సత్యం చెప్పరు, సభలో దాక్కుని కూర్చుంటారు. ధర్మరాజైన బాబాకు అంతా తెలుసు అని వారికి తెలియనే తెలియదు. సత్యమైన బాబాకు సత్యాన్ని వినిపించండి అన్నది కూడా శిక్షలను తగ్గించుకునేందుకు యుక్తి.

గీతము:- భోళానాథుని కన్నా అతీతమైనవారు... (భోలేనాథ్ సే నిరాలా...)

ఓంశాంతి. పిల్లలు అర్థం చేసుకున్నారు - భోళానాథుడు అని సదా శివుడిని అంటారు. శివ భోళా భండారి. శంకరుడిని భోళానాథుడు అని అనరు. అలాగే ఇంకెవరినీ జ్ఞానసాగరుడు అని అనలేరు. తండ్రి అంటారు - నేనే వచ్చి పిల్లలకు ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని వినిపిస్తాను. కావున జ్ఞానసాగరుడు ఒక్కరే ఉన్నట్లు కదా, శంకరుడు కాదు, అవ్యక్త బ్రహ్మ కాదు. అవ్యక్త బ్రహ్మ సూక్ష్మవతనంలో ఉంటారు. దాదాను భగవాన్ బ్రహ్మ అని ఎందుకంటారు? అని చాలామంది ఈ విషయంలో తికమకపడతారు. కానీ అవ్యక్త బ్రహ్మను కూడా భగవంతుడు అని అనలేము. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు - నేనే మీ పారలౌకిక తండ్రిని. పరలోకము అని స్వర్గాన్ని గాని, నరకాన్ని గాని అనరు. పరలోకము అన్నింటికన్నా అతీతమైన లోకము, అక్కడ ఆత్మలు నివసిస్తాయి అందుకే వారిని పరమ ప్రియమైన పారలౌకిక పరమపిత అని అంటారు, ఎందుకంటే వారు పరలోకములో నివసించేవారు. భక్తి మార్గం వారు ప్రార్థన చేస్తే, కళ్ళు తప్పకుండా పైకి వెళ్తాయి. కావున తండ్రి అర్థం చేయిస్తారు - నేను మొత్తం కల్పవృక్షమంతటికీ బీజరూపుడను. ఒక్క శివుడిని తప్ప ఇంకెవరినీ రచయిత అని అనలేము. వారొక్కరే రచయిత, మిగిలినవారంతా వారి రచన. కేవలం రచయితనే రచనకు వారసత్వాన్ని ఇస్తారు. మాకు ఈశ్వరుడు లేక ఖుదా జన్మనిచ్చారు అని అందరూ అంటారు. కావున ఆ ఒక్క ఈశ్వరుడిని అందరూ తండ్రి అని అంటారు. గాంధీని అయితే తండ్రి అని అనరు. అనంతమైన రచయిత తండ్రి ఒక్కరే. వారే అర్థం చేయిస్తారు - నేను మీ పారలౌకిక పరమపితను. ఇకపోతే ఆత్మలన్నీ ఒకేలా ఉంటాయి, పెద్దగా, చిన్నగా ఏమీ ఉండవు. జ్ఞాన సూర్యుడు, జ్ఞాన చంద్రుడు, జ్ఞాన సితారలు... ఆ సూర్య, చంద్రుల సైజ్ లోనైతే తేడా ఉంది కానీ ఆత్మల సైజ్ ఒకేలా ఉంటుంది. బాబా అంటారు - నేను సైజ్ లో పెద్దగా ఏమీ ఉండను కానీ నేను పరంధామ నివాసిని అందుకే నన్ను పరమ ఆత్మ అని అంటారు. పరమాత్మలోనే మొత్తం జ్ఞానముంది. వారంటారు - ఏ విధంగానైతే నేను అశరీరిగా ఉన్నానో, అలాగే ఆత్మ కూడా కొంత సమయం పరంధామంలో అశరీరిగా ఉంటుంది. ఇకపోతే స్టేజిపై ఎక్కువ సమయం ఉంటుంది. ఏ విధంగానైతే ఆత్మలైన మీరు సితారల వలె ఉన్నారో, అలాగే నేను కూడా ఉన్నాను. ఒకవేళ నేను పెద్దగా ఉన్నట్లయితే ఈ శరీరంలో ఇమడలేను. ఏ విధంగానైతే ఇతర ఆత్మలన్నీ పాత్రను అభినయించేందుకు వస్తాయో, అలాగే నేను కూడా వస్తాను. బాబా పాత్ర భక్తి మార్గం నుండి ప్రారంభమవుతుంది. సత్య, త్రేతాయుగాలలోనైతే పాత్రనే లేదు. ఇప్పుడు వారు స్వయంగా వచ్చి మనకు పూర్తి వారసత్వాన్ని ఇస్తారు. తమకన్నా రెండింతలు పైకే తీసుకువెళ్తారు. మనల్ని బ్రహ్మాండము మరియు సృష్టి, రెండింటికీ యజమానిగా చేస్తారు. పిల్లలను యోగ్యులుగా చేయడము అనేది ప్రతి తండ్రి యొక్క బాధ్యత, ఎంత సేవ చేస్తారు. ఎవరికైనా ఏడుగురు పిల్లలు ఉంటే, వారిలో ఒకరు డాక్టర్ గా, ఇంజినీర్ గా, వకీలు గా అయితే, ఆ తండ్రికి పట్టలేనంత ఆనందం కలుగుతుంది. తండ్రి పిల్లలందరినీ చదివించి యోగ్యులుగా చేసారని ఇతరులు కూడా వారి మహిమను చేస్తారు. కానీ అందరూ ఒకేలా తయారవ్వరు. ఒకరు ఒకలా అవుతారు, ఒకరు ఒకలా అవుతారు. అదే విధంగా బాబా అంటారు - నేను మిమ్మల్ని ఎంతగా యోగ్యులుగా చేస్తాను. ఈ బాబాను చూడండి ఎలా ఉన్నారు! వీరికి స్థూలమైన నామరూపాలేవీ లేవు. ఇతరుల తనువులోకి ప్రవేశించి చదివిస్తారు. ఇది ఖచ్చితంగా కల్పక్రితపు పాఠశాల, కావున తప్పకుండా గీతా భగవంతుడు గీతా పాఠశాలను తయారుచేసారు. అక్కడ అందరికీ జ్ఞాన గడ్డిని, జ్ఞానామృతాన్ని అందించారు. కొందరేమో శ్రీకృష్ణుని గోశాల అని అంటారు, కొందరేమో బ్రహ్మ యొక్క గోశాల అని అంటారు. కానీ అదేమిటి. శివబాబాకు శరీరం లేని కారణంగా బ్రహ్మతో కలిపేసారు. ఇకపోతే శ్రీకృష్ణుడికైతే గోవులను పాలించే అవసరము లేదు. శ్రీకృష్ణుడిని పతిత-పావనుడు అని అనరు. గాంధీ కూడా చేతిలో గీతను తీసుకొని నోటితో సీతారామా అని ఉచ్ఛరించేవారు. ఎందుకంటే, వారు రాముడు, కృష్ణుడు, తాబేలు, చేప అన్నింటిలోనూ భగవంతుడు ఉన్నారని

నమ్ముతారు. ఇంతకుముందు నేను కూడా అలా భావించేవాడిని. మా యొక్క బుద్ధి తాళం కూడా మూసుకుని ఉండేది. ఇప్పుడు తండ్రి వచ్చి మేల్కొల్పారు. అందరినీ సమాధి నుండి బయటకు తీసి, దోమల గుంపు వలె తిరిగి తీసుకువెళ్తారు. మళ్ళీ నెమ్మది-నెమ్మదిగా తమ సమయానికి కిందకు దిగుతారు.

నన్నొక్కరినే స్మృతి చేయండి అని తండ్రి మీకు అర్థం చేయిస్తారు. విద్యార్థికి కూడా తండ్రి, శిక్షకుడు గుర్తుంటారు. మీకైతే తండ్రి చదివిస్తారు. వీరే మీకు గురువు కూడా. ముగ్గురి ఫోర్సు ఉంది. అయినా ఇటువంటి తండ్రిని మర్చిపోతారా! ఇటువంటి (ఫుల్ కాస్ట్ గా పిలవబడే) పిల్లలు కూడా ఉన్నారు - వారు 5 నిమిషాలు కూడా స్మృతి చేయరు. అప్పుడు అంటారు - అహో మాయ, నేను పిల్లల తాళాన్ని తెరుస్తాను, నీవు మూసేస్తున్నావు. ఏ మాత్రము వికారాలలోకి వెళ్ళినా బుద్ధి తాళం మూసుకుపోతుంది. అయినా కానీ సత్యం వినిపించినట్లయితే శిక్ష తగ్గుతుంది. ఒకవేళ మీకు మీరే వెళ్ళి జడ్జికి తమ దోషాన్ని వినిపించినట్లయితే తక్కువ శిక్ష వేస్తారు. బాబా కూడా అలా చేస్తారు, ఒకవేళ ఎవరైనా చెడు పని చేసి దాచిపెట్టినట్లయితే వారికి కఠినమైన శిక్ష లభిస్తుంది. కావున ధర్మరాజు నుండి ఏమీ దాచిపెట్టకూడదు. వికారాలలోకి వెళ్ళి, మళ్ళీ దాక్కుని సభలో కూర్చునేవారు ఎంతోమంది ఉన్నారు, కానీ ధర్మరాజు నుండి దాచి పెట్టగలరా? నిశ్చయం లేదు కావున ఇటువంటి తండ్రిని కూడా మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. సాకారుడిని మోసం చేసినా కానీ, నిరాకారుడైన బాబాకైతే అన్నీ తెలుసు, మీకు ఈ తనువు ద్వారా శిక్షణను కూడా వారే ఇస్తున్నారు. మిమ్మల్ని చాలామంది అడుగుతారు, దాదా తనువులోకి పరమాత్మ ఎలా వస్తారు? వీరైతే గృహస్థుడు కదా. పిల్లలు కలవారు, వీరిలోకి ఎలా వస్తారు, ఎవరైనా సాధు-సన్యాసి తనువులోకి ఎందుకు రాలేదు? కానీ పరమాత్మ అయితే పతితులను పావనంగా తయారుచేయాలి. వారు పూజారుల నుండి పూజ్యులుగా తయారుచేస్తున్నారు, ఇది కూడా పిల్లిమొగ్గలాట వంటిది. బ్రాహ్మణులే దేవతలుగా, మళ్ళీ క్షత్రియులుగా, వైశ్యులుగా... అవుతారు. ఈ వర్ణాలు కూడా భారత్ లో ఉన్నాయి. ఇంకెక్కడా వర్ణాలు లేవు. ఇప్పుడు నేను 15 నిముషాలు భాషణ చేసాను. అలాగే మీరు కూడా అర్థం చేయించవచ్చు. బాబా తరచుగా డైరెక్టుగా మాట్లాడుతారు. మీరు అంటారు, శివబాబా ఇలా అర్థం చేయిస్తారు, శివుడు వేరు, శంకరుడు వేరు - ఇది కూడా స్పష్టంగా అర్థం చేయించాలి. ఇది బాబా పరిచయాన్ని ఇవ్వడము. హూ ఈజ్ హూ అని గవర్నమెంట్ యొక్క పుస్తకం వెలువడుతుంది. అలాగే ఈ పూర్వ నిర్ధారిత డ్రామాలో హూ ఈజ్ హూ - మనము అంటాము, ఉన్నతోన్నతమైనవారు శివబాబా, తర్వాత బ్రహ్మ, విష్ణు, శంకరులు, ఆ తర్వాత లక్ష్మీ-నారాయణులు, రామ-సీత, ఆ తర్వాత ధర్మ స్థాపన చేసేవారు. ఈ విధంగా ప్రపంచం పాతదిగా అవుతూ ఉంటుంది. దేవతలైన మీరు వామ మార్గంలోకి వెళ్ళిపోతారు. ఇప్పుడు తండ్రి వచ్చి మేల్కొల్పుతారు, వారంటారు, అన్నీ నాకు అర్పించండి మరియు నా మతంపై నడవండి. శ్రీమతమైతే వారిదనే అంటారు.

ఇకపోతే, లక్ష్మీ-నారాయణులు, సీతా-రాములు, ఎవరినైతే స్మృతి చేస్తారో వారందరూ వామ మార్గంలోకి వెళ్ళిపోయారు, ఇంకెవరు శ్రీమతాన్ని ఇవ్వగలరు. భక్తుల మనోకామనలను కూడా బాబానే పూర్తి చేస్తారు, ఎవరైనా చేప-తాబేలులో భావనను ఉంచినా వారి భావనను నేను పూర్తి చేస్తాను. చేప-తాబేలు అన్నింటిలో భగవంతుడు ఉన్నారని దానికి ఇలా అర్థం తీసారు. బాబా చాలా రహస్యాలను అర్థం చేయిస్తారు. కానీ అర్థం చేసుకునేవారు నంబరువారుగా ఉన్నారు, కావున పదవులు కూడా నంబరువారుగా ఉన్నాయి. ఈ దైవీ రాజ్యం స్థాపన అవుతుంది, ధర్మం కాదు. ధర్మాలనైతే ఇతర ధర్మాలవారు స్థాపన చేస్తారు. శివబాబా అయితే బ్రహ్మ ద్వారా రాజులకే రాజులుగా తయారుచేస్తారు. రాజులకే రాజులు అన్నదానికి అర్థం కూడా మీకు అర్థం చేయించారు. మిమ్మల్ని వికారీ రాజులు పూజిస్తారు, కావున ఎంత పెద్ద పదవి మీకు లభిస్తుంది. బాబా యొక్క మధురాతి-మధురమైన విషయాలు మీకు చాలా మంచిగా అనిపిస్తాయి కానీ మళ్ళీ లేచి టీ తాగగానే నషా తగ్గుతుంది. ఊరి వైపుకు వెళ్ళగానే పూర్తిగా దిగిపోతుంది. ఇక్కడైతే మీరు శివబాబా ఇంట్లో కూర్చున్నట్లు. అక్కడ చాలా తేడా వస్తుంది. ఎలాగైతే పతి విదేశాలకు వెళ్ళినప్పుడు పత్ని కన్నీరు కారుస్తుంది. వారేమీ సుఖాన్ని ఇవ్వరు, ఈ బాబా అయితే మీకు ఎంత సుఖాన్ని ఇస్తారు, మరి వీరిని విడిచి వెళ్ళినప్పుడు కూడా కన్నీరు వస్తుందా! మేము ఇక్కడే కూర్చుండిపోతాము అని చాలా మంది అంటారు. మరి మీ పిల్లలు ఎక్కడికి వెళ్తారు? మీరు సంభాళించండి అని అంటారు. నేను ఎంతమంది పిల్లలను సంభాళిస్తాను! కానీ ఉండండి, సేవాధారులుగా అయినట్లయితే మీ పిల్లలకు కూడా ఏర్పాటు జరుగుతుంది. ప్రారంభంలో కొద్దిమందే ఉండేవారు, కావున వారి పిల్లలను సంభాళించారు, ఇప్పుడు ఎంతమంది ఉన్నారు. వారి పిల్లలను సంబాళించినట్లయితే, వారిలో ఎవరైనా మాయమైతే, నా కొడుకును మాయం చేసేసారు అని అంటారు. సంభాళించేందుకు ఎవరినైతే పెడతారో - వారు కూడా అంటారు, మేము ఇతరుల కర్మ బంధనాన్ని ఎందుకు సంభాళించాలి. అచ్ఛా, అలాగైతే కొడుకైన ఆ ఒక్క శివుడినే సంభాళించండి, అప్పుడు వారు మీ పిల్లలను సంభాళిస్తారు. ఇకపోతే ఇటువంటి బాబాను ఎప్పుడు విడిచిపెట్టకండి. ఇలా చాలామంది

వదిలి వెళ్ళిపోయారు. వారిని మూర్ఖుల యొక్క అవతారము అని అంటారు. ఎవరైనా బ్రహ్మాకుమార-కుమారీతో అలిగినా కానీ శివబాబాతో ఎప్పుడూ అలగకండి. వారైతే మీకు రాజ్య-భాగ్యాన్ని ఇవ్వడానికి వచ్చారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తమదంతా తండ్రికి అర్పించి పూర్తిగా శ్రీమతంపై నడవాలి. ఏదైనా చెడు పని చేసి దాచిపెట్టకూడదు, జడ్జికి సత్యం చెప్పడము ద్వారా శిక్ష తగ్గుతుంది.

2. తండ్రిపై ఎప్పుడూ అలగకూడదు, సేవాధారిగా అవ్వాలి. మీ కర్మ బంధనాలను మీరే తెంచుకోవాలి.

వరదానము:- సంగమయుగం యొక్క ప్రతి ఘడియను ఉత్సవం రూపంలో జరుపుకునే సదా ఉల్లాస-ఉత్సాహ సంపన్న భవ

ఏ ఉత్సవాన్ని అయినా ఉల్లాస-ఉత్సాహాల కోసం జరుపుకుంటారు. బ్రాహ్మణ పిల్లలైన మీ జీవితమే ఉత్సాహాలతో నిండిన జీవితము. ఎలాగైతే ఈ శరీరంలో శ్వాస ఉంటే జీవితముంటుందో, అలాగే బ్రాహ్మణ జీవితానికి శ్వాస ఉల్లాస-ఉత్సాహాలు. అందుకే సంగమయుగం యొక్క ప్రతి ఘడియ ఉత్సవము. కానీ శ్వాస యొక్క గతి సదా ఏకరసంగా, సరైన రీతిలో ఉండాలి. ఒకవేళ శ్వాస యొక్క గతి చాలా వేగవంతంగా అయినా లేక నెమ్మదిగా ఉన్నా యథార్థ జీవితము అని అనబడదు. కనుక చెక్ చేసుకోండి, బ్రాహ్మణ జీవితం యొక్క ఉల్లాస-ఉత్సాహాల గతి సరైన రీతిలో ఉందా అనగా ఏకరసంగా ఉందా!

స్లోగన్:- సర్వ శక్తుల ఖజానాతో సంపన్నంగా ఉండడము - ఇదే బ్రాహ్మణ స్వరూపం యొక్క విశేషత.

మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

1) ఓ గీతా భగవంతుడా, మీ మాటను నిలబెట్టుకునేందుకు రండి అని మనుష్యులు పాటను పాడుతారు. ఇప్పుడు స్వయంగా ఆ గీతా భగవంతుడు తన కల్ప క్రితపు మాటను పాలన చేసేందుకు వచ్చారు మరియు వారంటారు - ఓ పిల్లలూ, ఎప్పుడైతే భారత్ లో అతి ధర్మ గ్లాని అవుతుందో, అప్పుడు నేను అదే సమయంలో, నా ప్రతిజ్ఞను నిలబెట్టుకోవడం కోసం తప్పకుండా వస్తాను, ఇప్పుడు నేను రావడము అంటే దానికి అర్థము, నేనేమీ ప్రతి యుగంలోను వస్తానని కాదు. అన్ని యుగాలలోనూ ధర్మ గ్లాని ఏమీ జరగదు, ధర్మ గ్లాని కలియుగంలోనే జరుగుతుంది, కావున పరమాత్మ కలియుగ సమయంలోనే వస్తారని అర్థం చేసుకోండి. మరియు కలియుగం మళ్ళీ కల్ప-కల్పము వస్తుంది, కనుక నేను కల్ప-కల్పము వస్తానని అర్థం చేసుకోండి. కల్పంలో నాలుగు యుగాలు ఉంటాయి, దానినే కల్పము అని అంటారు. అర్ధకల్పము సత్య-త్రేతా యుగాలలో సతోగుణము, సతోప్రధానత ఉంటాయి, అక్కడ పరమాత్మ రావాల్సిన అవసరమేమీ ఉండదు. మరియు మూడవదైన ద్వాపర యుగం నుండైతే ఇతర ధర్మాలు ప్రారంభమవుతాయి, ఆ సమయంలో కూడా అతి ధర్మ గ్లాని జరగదు, దీని ద్వారా పరమాత్మ మూడు యుగాలలో రానే రారు అని ఋజువవుతుంది, ఇకపోతే మిగిలింది కలియుగము, దాని అంతిమంలో అతి ధర్మ గ్లాని జరుగుతుంది. ఆ సమయంలో పరమాత్మ వచ్చి అధర్మాన్ని వినాశనం చేసి సత్య ధర్మాన్ని స్థాపన చేస్తారు. ఒకవేళ ద్వాపరంలో వచ్చి ఉంటే, ద్వాపరం తర్వాత ఇప్పుడు సత్యయుగం ఉండాలి, మరి కలియుగం ఎందుకు ఉంది? పరమాత్మ ఘోర కలియుగాన్ని స్థాపన చేసారని అయితే అనరు, ఇప్పుడు అలా జరగనే జరగదు, అందుకే పరమాత్మ అంటారు, నేను ఒక్కడినే మరియు ఒక్కసారే వచ్చి అధర్మాన్ని వినాశనం చేసి, కలియుగాన్ని వినాశనం చేసి, సత్యయుగాన్ని స్థాపన చేస్తాను కావున నేను వచ్చే సమయము సంగమయుగము.

2) ఇప్పుడు ఇదైతే మనకు తెలుసు, మనుష్యాత్మల అదృష్టాన్ని తయారుచేసేవారు ఎవరు మరియు అదృష్టాన్ని పాడు చేసేవారు ఎవరు? అదృష్టాన్ని తయారుచేసేది, అదృష్టాన్ని పాడు చేసేది ఆ పరమాత్మనే అని మనం అనము. అయితే, తప్పకుండా అదృష్టాన్ని తయారుచేసేవారైతే పరమాత్మ మరియు అదృష్టాన్ని పాడు చేసేవారు స్వయం మనుష్యులు. ఇప్పుడు ఈ అదృష్టం తయారయ్యేది ఎలా? మరియు మళ్ళీ పడిపోయేది ఎలా? దీనిపై అర్థం చేయించడం

జరుగుతుంది. మనుష్యులు ఎప్పుడైతే స్వయాన్ని తెలుసుకుంటారో మరియు పవిత్రంగా అవుతారో, అప్పుడు పాడైపోయిన ఆ అదృష్టాన్ని మళ్ళీ తయారుచేసుకుంటారు. ఇప్పుడు మనం పాడైపోయిన అదృష్టం అని అంటున్నామంటే, ఏదో ఒక సమయంలో మన అదృష్టం తయారై ఉండేది, అది మళ్ళీ పాడైపోయింది అని దీని బట్టి ఋజువవుతుంది. ఇప్పుడు మళ్ళీ ఆ పాడైపోయిన అదృష్టాన్ని పరమాత్మ స్వయంగా వచ్చి బాగుచేస్తారు. ఇప్పుడు ఎవరైనా, పరమాత్మ స్వయం నిరాకారుడు, వారు అదృష్టాన్ని ఎలా తయారుచేస్తారు అని అంటే, వారికి ఇలా అర్థం చేయించడం జరుగుతుంది - నిరాకార పరమాత్మ ఎలా తమ సాకార బ్రహ్మ తనువు ద్వారా, అవినాశీ జ్ఞానం ద్వారా మన పాడైపోయిన అదృష్టాన్ని బాగుచేస్తారు అని. ఇప్పుడు ఈ జ్ఞానాన్ని ఇవ్వడము పరమాత్మ పని, ఇకపోతే మనుష్యాత్మలు ఒకరి అదృష్టాన్ని ఒకరు మేల్కొల్పలేరు. అదృష్టాన్ని మేల్కొల్పేవారు ఒక్క పరమాత్మనే, అందుకే వారి స్మృతిచిహ్న మందిరాలు నిలిచి ఉన్నాయి. అచ్ఛా. ఓం శాంతి.